# తోడొకరుండిన

నవల

## పోలంరాజు శారద



**Thodokarundina...** Novel
(Serialized in 'Koumudi' Monthly Web Magazine)

By
**Sharada Polamraju**

First Published: July, 2018

© Author

Address:
**P. Sharada**
501, Vaishnovi-3,
TNR's Street No. 15, Alakapuri,
Hyderabad-500102.
Mobile: 93921 27895

Copies: 500

Rs. 120/-

Book Publishing Works:
**JV Publications**
jyothivalaboju@gmail.com

Cover Design:
**Chaitanya**

DTP & Type Setting:
**K. Ravi Prabha**
Cell: 96666 08835

*Printed at:*
**Karshak Art Printers**
Vidyanagar, Hyd.44

*for Copies:*
**Jyothivalaboju**
Phone: 80963 10140

& All Major Book Shops

# తోడొకరుండిన...

"ఏంటి పూర్ణిమ ఈ రోజు లంచ్ తేలేదా, సాండ్‌విచ్ తెప్పించావు?" తోటి లెక్చరర్ అడిగింది.

"తెచ్చాను. కాని ఎందుకో ఇవాళ చట్‌పటా తిందామనిపించింది. ఇదిగో అందరికీ తెప్పించాను. తలా ఒక పీస్ తీసుకోండి. నా బాక్స్ కూడా మీరు షేర్ చేయాలి."

ప్రతి రోజూ లంచ్ టైంలో అందరూ కలిసి ఒకరి వంటల రుచులు ఇంకొకరు ఆనందిస్తూ భోజనం చేయటం అలవాటయింది. ఆ రోజు జరిగిన క్లాసుల విశేషాలు, పిల్లల ఆగడాల గురించి కూడా చర్చించుకోవటం పరిపాటి.

"అబ్బో వీళ్ళు పిల్లలా, పిల్ల రాక్షసులా? రోజు రోజుకూ వీళ్ళ ఆగడాలు మరీ ఎక్కువవుతున్నాయి." మొహం చిటపటలాడిస్తూ డబ్బా విప్పాడు రాజీవ్.

స్టూడెంట్స్ క్లాసులలో కన్నా లైబ్రరీలో ఎక్కువగా కాలం గడపటంతో పూర్ణిమకు వారితో అనుబంధం ఎక్కువ. "సరేలెండి సార్, ఈ రోజులలో స్టూడెంట్స్ మనలాగా వుండమంటే ఎట్లా వుంటారు? వాళ్ళను వాళ్ళ పద్ధతిలోనే టాకిల్ చేయాలి."

"మీకేం మేడమ్! మీరు బాగానే చెప్పుతారు. వాళ్ళు చేసే కోతి పనులు

భరించలేక, వాళ్ళ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక సతమతమవుతున్నామంటే నమ్మండి. పడక పడక ఈ మగపిల్లల కాలేజీలో పడ్డాము. అదే ఏ ఆడపిల్లల కాలేజీలోనయినా ఈ గొడవ వుండేది కాదేమో! ఏదో పాఠాలు చెప్పుకొని జీతాలు తీసుకొని బయటపడేవాళ్ళము." కొత్తగా చేరిన కుర్ర లెక్చరర్ ఆక్రోశం.

"మీరే అట్లా అంటే ఎట్లా రాజీవ్? మూడేండ్ల క్రితం వరకు మీరు కూడా అదే ప్లేస్‌లో చేసిన అల్లరి మర్చిపోయినారా? లేకపోతే రాముడు బుద్ధిమంతుడు అన్న తీరున వుండేవారా? అయినా ఆడపిల్లలు కూడా ఈ రోజుల్లో నేమిటి, మా కాలంలోనే చాలా అల్లరి చేసేవాళ్ళం. అదంతా దూరపుకొండలే. స్టూడెంట్సంటే స్టూడెంట్సే. ఆడైనా మగైనా ఒకటే." నవ్వుతూ వివరించింది పూర్ణిమ.

దాదాపు ముప్పయ్యేళ్ళ సర్వీస్ వున్న ఆమె అనేక రకాల మనస్తత్వాల స్టూడెంట్స్‌ను, కుర్ర లెక్చరర్స్‌నూ చూసింది. తనకన్నా ముందు రిటైరయిన సీనియర్స్‌ను కూడా చూసింది. వాళ్ళ మనస్తత్వాలను బాగా ఆకళింపు చేసుకొని ఎటువంటి వాళ్ళతో ఎట్లా వుండాలో నేర్చుకుంది.

క్లాసులో పాఠాలు చెప్పేవాళ్ళవి ఒక రకమైన సమస్యలైతే, లైబ్రరీలో అల్లరి చేసే స్టూడెంట్స్‌ను కంట్రోల్ చేసే లైబ్రేరియన్ సమస్యలు ఇంకో రకం.

పేరుకు 'సైలెన్స్ ప్లీజ్' అన్న బోర్డు వేళ్ళాడుతూనే వుంటుంది. కాని రీడింగ్ రూమ్‌లో ఎవరి ధోరణి వాళ్ళదిగా రణగణ ధ్వనితో వుంటుంది. అటువంటి సమయంలో పూర్ణిమ తన రూమ్‌లోంచి బయటికి వచ్చి, వాళ్ళ మధ్యలో కూర్చొని ఏదో ఒక టాపిక్ మీద చర్చ మొదలెట్టేది. దాంతో సద్దుమణిగి అందరూ చాలా ఇంటరెస్టింగ్‌గా ఆ చర్చలో పాల్గొంటూ ఏవైనా సందేహాలుంటే తీర్చుకుంటూ కాలక్షేపం చేస్తూ వుంటారు. అన్ని చర్చలు చాలా నెమ్మదైన గొంతుకలతో వుండేవి. కనుక నిజంగా సీరియస్ చదువుకని వచ్చిన స్టూడెంట్స్, లెక్చరర్స్‌కు ఎటువంటి డిస్టర్బెన్స్ లేకుండా వుండేలా చూసుకొనేది.

మరీ రౌడీతనం చేసేవాళ్ళను మచ్చిక చేసుకొని "కొద్దిగా నాకు తలనొప్పిగా వున్నది. లైబ్రరీలో ఎవరూ కూడా గొడవ చేయకుండా చూసుకుంటారా, ప్లీజ్" అనేటప్పటికి వాళ్ళు వుబ్బితబ్బిబ్బయి డిసిప్లిన్ చూసుకొనేవారు.

దాంతో ఆమె మీద కాన్ఫిడెన్స్ పెరిగి, ఏ విషయంలోనైనా డౌట్స్ వుంటే నేరుగా లైబ్రరీ మేడమ్ దగ్గర అడుగుదామంటూ వచ్చేవారు. పూర్ణిమ తనకు

తెలిసిన విషయమయితే వెంటనే డౌట్ క్లియర్ చేసేది, తెలియని విషయమయితే రెఫర్ చేసి వివరించేది. అంతే కాని ఆ సబ్జెక్ట్ నాకు తెలియదు అంటూ ఎవరినీ కూడా పంపించేది కాదు.

ఆ విషయమయి కొందరు స్టాఫ్ అసూయతోనే కాని, మెచ్చుకోలుగానే కాని, "పూర్ణిమ మేడమ్ వద్ద ఏం వశీకరణం వుందో ఏమో రౌడీ వెధవలు కూడా బుద్ధిగా మసులుకుంటారు" అంటూ వుంటారు.

అందరూ భోజనాలకు ఉపక్రమించారు. కాయితంలో చుట్టి తెచ్చిన సాండ్‌విచ్ చేతిలోకి తీసుకొని కొరుకుతూ, "ఈ రోజు ఒక గమ్మత్తైన ఇన్సిడెంట్ జరిగింది. ఒక స్టూడెంట్ పైల్మాన్ వంటి తన ఫ్రెండ్‌ను లైబ్రరీలోకి తీసు...." అంటూ మొదలెట్టిన పూర్ణిమ నోటపెట్టబోతున్న చేయిని అట్లాగే వుంచేసి, మాట మధ్యలోనే ఆపేసి రెండో చేత్తో కాయితాన్ని చేతిలోకి తీసుకొని చదవటం మొదలెట్టింది.

తినటానికి తెరిచిన నోరు తెరిచినట్టే వుంది. ఎత్తిన చెయ్యి ఎత్తినట్టే వుంది. చుట్టూ అందరూ వున్న విషయం కూడా ధ్యాసలో లేనట్టే అయిపోయి చదువుతున్నది. అందరూ ఆమె చేష్టలకు విస్తుపోయారు. ఎవరూ ఏమీ మాట్లాడకుండా వాళ్ళు కూడా తినటం ఆపేసి, ఒకళ్ళనొకళ్ళు సైగల ద్వారా "ఏం జరిగి వుంటుంది?" అని కళ్ళతోనే ప్రశ్నించుకుంటున్నారు.

వాళ్ళల్లో సీనియర్ అరుణ "అబ్బ పూర్ణిమా! నీ పాత అలవాటు మానవు కదా! తెల్లకాగితం మీద నలుపు చూస్తే చాలు చదవందే వూరుకోవు. ఒకసారి ఏమైందో తెలుసా, ఇట్లాగే ఏదో పొట్లం విప్పగానే ఆ కాయితం మీద క్రాస్‌వర్డ్ పజిల్ కనిపించింది. అంతే. చేసే చేసే పని ఆపేసి అది నింపటం మొదలెట్టింది. అది ఎప్పటి పేపరో ఏమో కూడా తెలియదు. అంత పిచ్చి తనకు" అంటూ పరిహాసమాడినా కూడా తలఎత్తకుండా చదివి అట్లాగే ఆ పేపర్ చూస్తూ వున్న పూర్ణిమ కళ్ళల్లో నీటిపొర కనిపించేటప్పటికి అరుణ కొంత ఆందోళనగా "ఏంటది పూర్ణిమా? మాట్లాడుతూ మధ్యలోనే ఆపేసి చదువుతున్న అంత ఇంటరెస్టింగ్ మాటర్ ఏంటో, నేను కూడా చూడవచ్చా!" అంటూ చనువుగా ఆ కాగితాన్ని తీసుకొని చదువుతూ ముఖం చిట్లించింది.

ఏదో పాత వారపత్రికలో అచ్చయిన అర్థంపర్థం లేని కవిత. అందులో అంతగా పూర్ణిమను ఆకట్టుకున్నదేమిటో?

తలెత్తి చూసేటప్పటికి పూర్ణిమ కళ్ళల్లో నీళ్ళు నిండుకున్నాయి. చేతిలో వున్న సాండ్‌విచ్ పక్కనే ప్లేట్లో పడేసి "రాజూ, రాజూ" అని అటెండర్‌ను కేకేసింది.

అందరూ తేరుకొని, "అరుణగారూ! ఏంటా కాగితం?" అని ప్రశ్నిస్తుండగానే రాజు లోపలికి రావటం "రాజూ! ఈ సాండ్‌విచ్ ఎక్కడి నుండి పట్టుకొచ్చావు?" ఆమె కంఠం వణుకుతున్నది. "లడ్డు బండి మీదనుంచి తెచ్చాను మేడమ్."

"ఒకసారి లడ్డును ఇక్కడికి రమ్మను."

"ఏమైంది మేడమ్? బాగలేదా? ఇంకో చోటి నుండి తెమ్మన్నారా?"

"రాజూ! అధిక ప్రసంగం చేయకు. చెప్పిన పని చేయి. లడ్డును రమ్మను."

ఎన్నడూ లేనిది ఆమె కంఠంలో తీవ్రతకు అందరూ ఆశ్చర్యపోయారు.

బండి వద్దనున్న లడ్డు అని అందరూ ముద్దుగా పిలుచుకొనే లాడ్లా సింగ్ వచ్చే వరకు పూర్ణిమ ఎవరితోనూ మాట్లాడకుండా చేతులలో తలపెట్టుకొని కూర్చుంది.

"క్యా హై మేడమ్ బులాయే? ఇంకేమన్న కావల్నా మేడమ్. భేల్ పూరీ బిజావూ?"

అతని ప్రశ్నలు విననట్టే, "లడ్డూ, ఈ సాండ్‌విచ్ కట్టిన పేపర్ ఏదో మాగజైన్‌లోది కదా! ఇది ఎక్కడిది?"

"కల్ రద్దీ వాలేకే పాస్ లియే మేడమ్. ముజ్ సే కుచ్ గల్తీ హువా క్యా మేడమ్. క్యా బాత్ హై?" ఏదైనా తినటానికి ఆర్డర్ ఇస్తారనుకుంటే మేడమ్ రద్దీ పేపర్ గురించి అడుగుతున్నదేంటా అని అతనికి అయోమయంగా వుంది.

"లడ్డూ ఈ పేపర్ చింపిన మాగజైన్ నీ దగ్గర వుంటే ఒకసారి నాకిస్తావా?" కాస్త ఆ మూడ్‌లో నుండి తేరుకొని మెల్లిగా అడిగింది.

"క్యోం నై మేడమ్! రాజుభై, మేరే సాత్ ఆవ్."

రాజు తెచ్చిన మాగజైన్ చేతిలోకి తీసుకొని, "రాజూ! ఒక చిన్న పేపర్, టేబిల్ మీద నా పెన్ తీసుకొని రా." మాగజైన్ అట్టమీద వున్న పేరు, డేట్ పేపర్ మీద రాసుకొని అప్పుడు ఈ ప్రపంచంలోకి వచ్చినట్టయి తల ఎత్తి, తినటం ఆపి తన వంకే చూస్తున్న కొలీగ్స్ వంక గిల్టీగా చూస్తూ, "ఐయామ్ సారీ, నేనేదో మూడ్‌లోకి వెళ్ళిపోయాను. మిమ్మల్నందరిని కన్ఫ్యూజ్ చేసినట్టున్నాను. కమాన్

కారీ ఆన్. లంచ్ చేయండి. నేను ఇప్పుడే వస్తాను" అంటూ లేచి వెళ్ళిపోయింది.

నేరుగా ప్రిన్సిపాల్‌గారి రూమ్‌కెళ్ళిపోయి, "ఎక్స్‌క్యూజ్‌మీ సార్, నాకు ఒక అర్జెంట్ వర్క్ వుంది. హాఫ్‌డే లీవ్ పెట్టి వెళ్ళుతాను. పర్మిషన్ ఇస్తారా?" రిక్వెస్ట్ చేసింది.

ఆయన గోడ గడియారం వైపు చూసి, "హాఫ్ డే లీవ్ ఏమీ అవసరం లేదు. అప్పుడే రెండయింది. మీరు వెళ్ళవచ్చు. "పంక్చుయాలిటీ మెయిన్‌టైన్ చేసే పూర్ణిమ ఎంతో అవసరం వుంటే తప్ప అట్లా అడగదని ఆయనకు తెలుసు అందుకనే వెంటనే అనుమతి ఇచ్చాడు. మెట్లు దిగుతూ చేతిలో వున్న సెల్‌ఫోన్ తీసి డయల్ చేసింది. "తరుణీ ఎక్కడున్నావు?"

సమాధానం విని, "అయితే నేను ఇప్పుడే మీ ఇంటికి వస్తున్నాను."

...................

"నువ్వేమీ కంగారు పడవద్దు. మన కుసుమ ఆచూకీ తెలిసింది."

...........

"ఆఁ. ఆ విషయమే నీతో మాట్లాడాలి. మన రేణుకను కూడా రమ్మని ఫోన్ చేస్తాను."

...............

"వివరాలు వచ్చి చెప్పుతాను. ఒక అరగంటలో అక్కడ వుంటాను. బై" అంటూ మరో నంబర్ తిప్పి అదే సమాచారం చెప్పి గబగబ కిందకు దిగింది. అప్పటికే లంచ్ ముగించుకొని మాటా పలుకూ లేకుండా టీ తాగుతున్న కొలీగ్స్‌ను చూసి,

"సారీ ఫ్రెండ్స్ నేను అర్జెంట్‌గా వెళ్ళాలి" అని, "రాజూ, బంజారా హిల్స్‌కు ఒక ఆటో పిలుచుకొని రా" గబ గబా తన బాగ్ సర్దుకొని "బై ఫ్రెండ్స్, సీ యూ" అంటూ పరుగెట్టినట్టే వెళ్ళింది.

అప్పటికి తేరుకొన్న కొలీగ్స్‌కు నోరు పెగిలింది.

"అరుణా! మీరు, పూర్ణిమ మేడమ్ చాలా క్లోజ్ కదా! ఈ రోజు ఆవిడ ప్రవర్తన మీకు వింతగా అనిపించటం లేదా?"

"అవును రాధికా, ఎంతో ఆశ్చర్యంగా వున్నది. ఆ కాయితం చదివి అంత

అప్‌సెట్ అయ్యేంత ఏముందో అర్థం అవటల్లేదు.”

“హేయ్ అరుణా ఆ పేపర్ నీ దగ్గరే వున్నదా? పూర్ణిమ తీసుకెళ్ళిపోయిందా?”

“అవును కదూ! ఆ పేపర్ నా దగ్గరే వుంది. చదువుదాము వుండండి.”

అప్పటిదాకా చేతిలో నలుగుతున్న కాయితాన్ని టేబిల్‌మీద పెట్టి సాఫీగా చేసి, “ఇదేదో తెలుగు పత్రికలో ప్రచురింపబడ్డ ఒక శీర్షికలో కవిత. దాని పేరు ‘తోడొకరుండిన అదే భాగ్యము’, డేట్ వున్న భాగం చినిగిపోయి వుంది. ఈ ఆర్టికలే పూర్ణిమను అంత ప్రభావితం చేసింది.”

“మీకు అభ్యంతరం లేకపోతే పెద్దగా చదవరాదూ! అందరమూ విందాము.”

అరుణ చదవటం మొదలెట్టి ఆగిపోయింది. ఇది రాసినవారి పేరు ‘పూతరేకులు’ అని వుంది. ఆలోచనలో పడింది.

“పూతరేకులు! పూతరేకులు. చాలాసార్లు విన్న పదం.”

“చాలాసార్లు వినటం ఏంటి అరుణా, పూతరేకులు అంటే అది ఒక స్వీట్ కదా!” నవ్వింది రాధిక.

“కాదు రాధికా, ఆ స్వీట్ కాదు. ఆ పదం పూర్ణిమ నోటి వెంట చాలాసార్లు విన్నాను. కాని సమయానికి గుర్తు రావటల్లేదు.”

“పోనీ అసలు అందులో వున్న మాటరేంటో చదవరాదా!”

❖ ❖ ❖

తరుణి ఇంటి ముందు ఆటో దిగి హడావుడిగా లోపలికి వెళ్ళిన పూర్ణిమ అప్పటికే రేణుక కూడా వచ్చి వుండేటప్పటికి, “అమ్మయ్య వచ్చేసావా? నీకోసం ఎంతసేపు వెయిట్ చేయాలో అని కంగారు పడుతున్నాను” అంటూ చెమట్లు కక్కుతూ సోఫాలో చతికిలపడింది.

“పూర్ణి లంచ్ చేసావా?” చల్లటి మంచినీళ్ళ గ్లాసుతో వచ్చిన తరుణి నెమ్మదిగా అడిగింది.

“లేదే ఆ లంచ్ చేయబోయే నాకు కుసుమ సంగతి తెలిసింది.”

వాళ్ళిద్దరికి అర్థం కాలేదు. “నువ్వు లంచ్ చేయటానికి, కుసుమ సంగతి తెలియటానికి సంబంధం ఏంటే?”

"సరేలే ముందర ఏమైనా తిను. ఆ తరువాత మాట్లాడుదువు కాని. లేకపోతే డైనింగ్ టేబిల్ దగ్గరే మాట్లాడుకుందాము." ముగ్గురూ టేబిల్ చుట్టూ కూర్చున్నారు.

అప్పటికి పూర్ణిమకు తను మాట్లాడుతున్నది అతుకుల బొంతగా వున్నట్టు అర్థమయి, "సారీ ఫ్రెండ్స్, ఈ రోజు నాకు ఏదైనా చాట్ తిందామని అనిపించి బయట బండి మీద నుంచి సాండ్‌విచ్ తెప్పించాను..." అంటూ మొదలెట్టి తను చదివిన ఆర్టికల్ గురించి అంతా చెప్పి బాగ్‌లో నుండి మాగజైన్ తీసింది.

"అయ్యో! మిమ్మల్ని కలుద్దామన్న నా హడావుడిలో ఆ పేపర్ కటింగ్ కాలేజీలోనే మర్చిపోయాను. తరుణీ! నువ్వు రెగ్యులర్‌గా వారపత్రికలు తెప్పిస్తూంటావు కదా, ఇదిగో ఈ డేట్ పత్రిక వుందేమో చూడవే." తన హడావుడికి తనను తిట్టుకుంటూ అన్నది.

క్రానలాజికల్ ఆర్డర్లో నీట్‌గా బొత్తి పెట్టి వున్న పత్రికలనుండి అది తీయటం కష్టం కాలేదు. వెంటనే పూర్ణిమ లాక్కున్నట్టు తీసుకొని విషయసూచిక చూసి గబగబా తనకు కావలసిన పేజీకి వెళ్ళింది. ఇదిగో ఇది చదివితే మీకే తెలుస్తుంది.

రేణుక పత్రిక అందుకొని పెద్దగా చదవసాగింది. తోడొకరుండిన అదే భాగ్యమూ...

❖ ❖ ❖

కాలేజీలో అరుణ అందరికీ వినిపించేటట్టుగా చదవటం మొదలెట్టింది.

'ఎక్కడున్నారు నా నేస్తాలూ?
ఏ జన్మలో పుణ్యమో భగవంతుడు మానవులకిచ్చిన గొప్పవరం కన్నీరు.
పైకి కనపడని గుండెకోతకు సాక్ష్యమే ఈ కన్నీళ్ళు.
జీవితంలోని చేదు నిజాలను దాచిపెట్టగల ఏకైక ఖజానా కన్నీరే.
గత జీవితపు ఆనందపుటంచులను వెలికి తీసే వాకిళ్ళు కన్నీరు.'

"ఏమిటి మేడమ్! ఈ అర్థం పర్థం లేని పిచ్చి కవిత?" మధ్యలోనే ఆపి అన్నాడు రాజీవ్.

"కానీండి అంతా చదివితే కాని పూర్ణిమ ఆ విధంగా ఎందుకు రియాక్ట్ అయిందో తెలియదు" అంటూ మళ్ళీ కొనసాగించింది.

❖ ❖ ❖

చదవటం ముగించిన అరుణ ఆలోచనలో పడింది.

'అసలు ఈ పిచ్చిరాతకు ఏమైనా అర్థం వున్నదా? ఎవరో ప్రింట్‌లో పేరు చూసుకోవాలని పెన్ నేమ్‌తో అర్థం పర్థం లేని కవిత ఏదో రాస్తే మన పూర్ణిమ మేడమ్ దానికి అంత ఎమోషనల్ అవటం ఏమిటో?'

"లేదు రాధికా! ఈ రాత మనకు చదవటానికి పిచ్చి కవితలాగా ధ్వనించినా పూర్ణిమకు అందులో ఏదో మనకు తెలియని మెసేజి వుండే వుంటుంది. అవును. ఇప్పుడు గుర్తుకు వచ్చింది. స్కూల్లోనూ, కాలేజీలోనూ పూర్ణిమ వాళ్ళు అయిదుగురు వుండేవారని, వాళ్ళ పేర్లలో మొదటి అక్షరాలు కలిపి అందరూ వారిని 'పూతరేకులు' అని నిక్‌నేమ్ పెట్టారని చెప్పుతుండేది. అందులో ఒక ఆమె అర్థాంతరంగా కాలేజీ రోజుల్లోనే దూరమయింది. ఒకామె ఎక్కడుందో తెలియదు. తతిమ్మా ముగ్గురూ తరుచుగా కలుస్తుంటామని చెప్పుతూ వుండేది. అదిగో ఆ పెన్‌నేమ్ కూడా అదే." పూర్ణిమతో పాతికేళ్ళ అనుబంధమున్న అరుణ లాజికల్‌గా ఆలోచించి మిస్టరీ విడదీసింది.

❖ ❖ ❖

ముగ్గురు స్నేహితురాళ్ళూ కొన్ని నిమిషాలు మౌనంగా కూర్చున్నారు.

"నిశ్చయంగా ఇది మన కుసుమ రాసిన ఆర్టికలే. అందులో సందేహం ఏ మాత్రమూ లేదు. చూసారా!" ముందుగా తేరుకున్న రేణుక అంటూ మళ్ళీ చదివింది.

'ఎక్కడున్నారు నా నేస్తాలు?
అనాధ జీవితంలో అశ్రుధారకు ఆనకట్టగా నిలిచారు.
కాలేజీ రోజులలో అండగా నిలిచారు.
అనుకోని పెనుభూతం నా మీదకు దూకబోతున్నది.
ఇంక ఒంటరిగా పోరాడే శక్తి క్షీణిస్తున్నది.
ఎక్కడున్నారు నా నేస్తాలూ?
మీ ముగ్గురిలో ఏ ఒక్కరైనా ఈ నా లేఖ చూస్తారన్న
నా ఆశ వమ్ము కాదని ఆశిస్తూ
మీ పూతరేకులు'

"ఈ శీర్షికకు రాసింది కుసుమ అని మనకు నమ్మకంగా తెలిసినంత మాత్రాన దాని ఆచూకీ ఎట్లా తెలుస్తుంది? అదీకాక కలం పేరుతో రాసింది

కూడా. ఎప్పుడో మూడు నెలల క్రితం ప్రచురణ అయింది.” మళ్ళీ రేణుకనే నిరుత్సాహంగా నోరు చప్పరించింది.

“లేదు రేణూ, ఈ పత్రిక గురించి నీకు తెలియదు. అందులో ప్రచురించిన ప్రతి ఆర్టికల్‌కి పారితోషికం వుంటుంది. చివరకు పాఠకులు అభిప్రాయాలు ఉత్తరం రాసినా కూడా ఎంతో కొంత పారితోషికం ఇస్తారు. అందుకనే వాళ్ళు ప్రత్యేకించి కలం పేరుతో రాసినా అసలు పేరు, ఎడ్రసు లేని రచనలు స్వీకరించబడవని మొదటి పేజీలోనే సూచన ప్రకటిస్తారు. కనుక మనం పత్రిక ఆఫీసుకు వెళ్ళి విచారిస్తే కుసుమ ఎడ్రస్ దొరికే అవకాశం వుంటుందని నా నమ్మకం. ఆ ధైర్యంతోటే నేను పరిగెట్టుకుంటూ వచ్చాను.”

పూర్ణిమ మాటలు విన్న తరువాత మిగతా ఇద్దరికీ కూడా కుసుమ ఆచూకీ తెలిసిపోయినంత సంతోషం కలిగింది.

“అయినా పత్రిక ఆఫీసులో అంత సులభంగా ఆచూకీ అపరిచిత వ్యక్తికి చెప్పుతారంటావా” అంటూ మళ్ళీ సందేహం వ్యక్తం చేసింది రేణుక.

“నీళ్ళల్లోకి దిగకుండానే దాని లోతు గురించి భయపడితే ఎట్లాగే? రేపొకసారి మనం వెళ్దాం. అక్కడ ఎడిటర్‌తో మాట్లాడుదాం. కాకపోతే అప్పటి సంగతి అప్పుడు చూసుకుందాం. అయినా ఒకరి ఎడ్రస్ తీసుకొని మోసాలు చేయటం, బ్లాక్‌మెయిల్ చేయటం వంటి క్రైం చేయటానికి మనమేమైనా టీనేజి వాళ్ళమా? కారణం వివరిస్తే సరి. అందులో అంత రహస్యం మెయిన్‌టైన్ చేయాల్సినది ఏమీ లేదు” అంటూ ఒకరికొకరు సమాధానపరుచుకుంటూ పత్రిక సంపాదకులను కలువటానికి నిర్ణయించుకున్నారు.

“మరైతే పోదామా?” తరుణి ఉత్సాహంగా లేచింది. “డ్రైవర్ కూడా వున్నాడు. వెళ్ళివద్దాం?”

పూర్ణిమ రిస్ట్‌వాచ్ చూసుకుంది. “ఆల్రెడీ నాలుగున్నర అయింది. వాళ్ళ టైమింగ్స్ ఏంటో మనకు తెలియదు. ఈ వేళప్పుడు వెళ్ళినా పని కాకపోతే అనవసరంగా డిసప్పాయింట్ అవాల్సి వస్తుంది. కనుక ఈ రాత్రి ఎట్లా మాట్లాడాలో బాగా ఆలోచించండి. రేపు మీరిద్దరూ ఫ్రీగానే వుంటారుగా?”

“నేను ఫ్రీగానే వుంటాను. పూర్ణీ! రేపు వర్కింగ్ డే కదే! వర్కింగ్ డే నాడు తుఫాను వచ్చినా కాలేజీ మానవుగా!” పరిహాసంగా అన్నది తరుణి.

"ఈ మాటర్ తుఫాను కన్నా, సునామీ కన్నా ముఖ్యమైనది. కుసుమ ఆచూకీ తెలిసేదాకా కాలేజీ గీలేజీ జాన్తా నై" కేర్‌ఫ్రీగా చేయి తిప్పుతూ డిక్లేర్ చేసింది. "మరి రేణు మహాతల్లి! తమరి సంగతి ఏమిట్ట?" అప్పుడే కుసుమ దొరికిపోయింది, ఆమెను కలుసుకోవటానికి పోతున్నాము అన్నంత ఆనందం కంఠంలో పెల్లుబికి పోతోంది.

రేణు ఆలోచనలో పడింది. "రేపు ఒక సర్జరీ వుంది. బహుశా పొద్దున అంటే వీలుపడకపోవచ్చు." గొంతులో కొద్దిగా నిరాశ తొంగి చూసింది.

"పోనీలేవే, అది ముఖ్యం. రేపు నేను, పూర్ణి వెళ్ళి అడ్రెస్ సంపాదించటానికి ప్రయత్నిస్తాం. ఆ తరువాత దానిని కలవటానికి పోయినప్పుడు ముగ్గురం కలిసే పోదాం." రేణుకను ఓదారుస్తున్నట్టు చెప్పింది తరుణి.

"అవునూ మనం కుసుమను చూసి ఎంతకాలం అయి వుండవచ్చు?" తరుణి జ్ఞాపకం తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ బుర్ర గోక్కుంది.

"ఏమోనే, నేనైతే ముప్పయ్యేళ్ళ కన్నా ముందు నీలోఫర్ హాస్పిటల్‌లో డ్యూటీ చేస్తుండగా కనిపించింది. ఆ చూడటమే. మళ్ళీ కనిపించలేదు."

"అయినా నాదే బుద్ధి తక్కువ. అంతకు క్రితం మూడు రోజుల నుండి విపరీతమైన ఆపరేషన్స్‌తో థియేటర్లోనే సరిపోయింది. వార్డ్సులో పేషంట్స్‌ను చూడటానికి కూడా జూనియర్సే వెళ్ళేవాళ్ళం. ఆ రోజున అప్పుడే కాస్త వూపిరి పీల్చుకోవటానికి టైం దొరికి బయటకు వచ్చి కాస్త రిలాక్స్ అయి రూమ్స్ వైపు వెళ్ళాను. అప్పుడు చూసాను కుసుమను. ఒక్క క్షణం గుర్తు పట్టలేకపోయాను. తలకు స్కార్ఫ్, నడుముకు నడికట్టుతో కనిపించింది. తను కూడా నన్ను చూసి మహా ఆనందపడింది. అప్పటికి మూడు రోజులు అయిందట డెలివరీ అయి. పండంటి మగపిల్లవాడు. దాని అత్తగారు కూడా అక్కడే కూర్చొని వుంది.

తనతో మాట్లాడుదామని కూర్చున్నానో లేదో కొంప మునిగిపోయినట్టు పబ్లిక్ అడ్రెస్ సిస్టంలో ఎమర్జెన్సీ కేసు అటెండ్ అవాలని నా పేరుతో మెసేజి వచ్చింది. మళ్ళీ ఆ తరువాత ఒకదానిమీద ఒకటిగా కేసులు వస్తూనే వున్నాయి. మర్రోజు మళ్ళీ తీరిగ్గా కుసుమను కలుద్దామని వెళ్ళేటప్పటికి అప్పటికే డిస్చార్జ్ అయి వెళ్ళిపోయిందని తెలిసింది. ఇంక మళ్ళీ వేరే హాస్పిటల్‌కి డ్యూటీ మారవలసి వచ్చింది. ఆ తరువాత ఏదో పని మీద ఢిల్లీ వెళ్ళాను. కనీసం అత్తగారింటి

అడ్రెస్ అయినా తీసుకోకపోతినే అనుకొన్నాను. అప్పుడే అడిగితే ఆఫీసులో ఏమైనా వెతికి ఇచ్చేవారేమో. ఆ ఆలోచన కూడా తట్టలేదు నా మట్టిబుర్రకు."

"ఒకసారి తాతయ్యగారు కనిపించారు. అప్పుడే వాళ్ళ ఆయన అమెరికాలో పై చదువుకు వెళ్ళినట్టు, కుసుమ కూడా అతని దగ్గరకు వెళ్ళిపోవటానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తాతయ్యగారు చెప్పారు. ఆ తర్వాత మళ్ళీ ఎవరికి కనిపించక పోయేటప్పటికి అయ్యో, చెప్పకుండానే మొగుడి దగ్గరకు వెళ్ళిపోయిందేమోనని ఎన్నిసార్లో అనుకున్నాము కూడా. మళ్ళీ తాతయ్యగారిని కలుద్దామంటే బాబాయికి ఇక్కడి నుంచి ట్రాన్స్‌ఫర్ అయింది. ఆ తరువాత కాంటాక్టే లేకుండా పోయింది." తరుణి వివరించింది.

"నేను తర్వాత పదేళ్ళకనుకుంటా మా చిన్నవాడి స్కూల్‌కెళ్ళినప్పుడు పదేళ్ళ పిల్లవాడి చేయి పట్టుకొని వెళ్ళటం కనిపించింది. అప్పటికే నన్ను చూసినట్టున్నది. బస్‌స్టాప్‌లో బస్ కోసం చూస్తున్నది. తనను చూసి నేను రోడ్డు క్రాస్ చేసేటప్పటికి గబగబా పిల్లవాడిని లాక్కెళ్ళుతున్నట్టే ఆటోలో ఎక్కి వెళ్ళిపోయింది. అప్పుడే అనిపించింది. తను ఎందుకో మనల్ని ఎవాయిడ్ చేస్తున్నట్టు వున్నది అని." పూర్ణిమ చెప్పింది. "అంత ఆస్తి ఏమయిందో? కార్లు, మేడలు వుండేవి. అన్నీ పోయి ఆటోలలో తిరగవలసిన అవసరం ఏం వచ్చిందో?"

"నిజమే. వాళ్ళ బాబాయికి ఇక్కడనుండి ట్రాన్స్‌ఫర్ అవటం, తాతగారు, బామ్మగారు మరణించటంతో వాళ్ళ పాత ఇంటికి వెళ్ళినా ఆచూకీ తెలియలేదు. ఇన్నాళ్ళూ భర్తతో అమెరికాలో వున్నదని అనుకుంటున్నాము. ఇప్పుడు ఖచ్చితంగా తెలుస్తున్నది. తను ఏదో మళ్ళీ డిప్రెషన్‌లోకి వెళ్ళినట్టున్నది."

"ఏంటో దాని బతుకంతా ఇట్లాగే అవుతోంది. చిన్నప్పడి నుండి మనమందరమూ అండగా నిలిచి ఒక దారికి తేవటానికి ఎంత తంటాలుపడ్డామో. అమ్మయ్య! ఒక దారికొచ్చింది అనుకుంటే మళ్ళీ ఏదో వూబిలో కూరుకుపోయి నట్టున్నది. ఇదిగో మళ్ళీ అనాధను అన్న విషయం ప్రస్తావిస్తున్నది. అంటే మళ్ళీ వ్యవహారం మొదటికొచ్చినట్టున్నది."

ఆ రాత్రి ముగ్గురికీ నిద్ర కరువయింది. ఎగ్జయిట్‌మెంటో, టెన్షనో, ఆనందమో ఏదీ తెలియని కలగూరగంప వంటి భావనలు. ఆలోచనలు గతంలోకి ప్రయాణించాయి.

❖ ❖ ❖

తరుణి, పూర్ణిమ చిన్నపిల్లలుగా వున్నప్పటి నుండే వాళ్ళ తల్లితండ్రులు ఒకటే కాలనీలో వుండేవాళ్ళు.

పూర్ణిమ నాన్నగారు సెక్రటేరియెట్‌లో ఆఫీసర్. వాళ్ళది పెద్ద కుటుంబం. అన్నదమ్ములు ముగ్గురు, వారి తల్లి పిల్లలతో ఒకటే సమిష్టి కుటుంబం. చాలా స్నేహపాత్రులు. అన్నదమ్ములందరి సంతానంలోకి పూర్ణిమ పెద్దది. ఇంట్లో అత్తగారు జానకమ్మ అజమాయిషీలో కోడళ్ళు వంటిల్లు చూసుకొనేవారు.

పూర్ణిమ వయసుకు చిన్నదయినా తనకు తోచిన చిన్న చిన్న పనులలో పెద్దలకు చేదోడు వాదోడుగా వుండేది. చెల్లెళ్ళకు తలలు దువ్వి జడలు వేయటం, తమ్ముళ్ళకు షూస్ వేయటం వంటి పనులన్నీ ఒకరు చెప్పకుండానే చేయటం నేర్చుకున్నది. అట్లాగే స్కూల్ నుండి ఇంటికి వెళ్ళగానే తన హెూంవర్క్ చేసుకుంటూనే, తతిమ్మా వాళ్ళ హెూంవర్క్ దగ్గరుండి చేయించేది. వాళ్ళకు కథలు చెప్పి పడుకోబెట్టే బాధ్యత కూడా నిర్వహించేది.

వాళ్ళ నాయనమ్మ జానకమ్మకయితే ఆ పిల్లను చూస్తే ఎంతో మురిపెం. "పిచ్చిపిల్ల! అభం శుభం ఎరుగదు. అయినా ఒకరు చెప్పాల్సిన పని లేకుండా ఎంత చక్కగా పని చక్కపెడుతున్నదో చూశావుటే!" అంటూ చుట్టపుచూపుగా వచ్చిన కూతురితోనూ, ఇతర బంధువులతోనూ చెప్పుకొని మురిసిపోయేది.

"ఆఁ అదొక పెద్ద పనా అమ్మా! ఆడపిల్ల అన్న తరువాత ఆ మాత్రం పనులు చేయకపోతే ఎట్లా?" అంటూ సాగదీసేది ఆమె కూతురు అనసూయ.

ఆమె కూతురు కాంతం కూడా పూర్ణిమ వయస్సుదే. కాని కొరకరాని కొయ్య. ఒక్క పని కూడా అందుకునేది కాదు. చకచకా అన్నాల ముందర కంచాలు, మంచినీళ్ళు సర్దటం, భోజనాల తరువాత ఎంగిళ్ళు శుభ్రం చేయటం వంటి పనులు చేసే పూర్ణిమ అంటే అసూయ.

"అయినా అన్నయ్య వంటి మధ్యతరగతి పెద్ద కుటుంబీకుల ఇళ్ళల్లో ఆడపిల్లలు ఆ మాత్రం పనులు నేర్చుకోకపోతే రేప్పొద్దున అత్తారిళ్ళల్లో ఇబ్బంది పడరుటే? నౌకర్లు, చాకర్లు వున్న పెద్దింటి సంబంధాలు అన్నయ్య వల్ల ఏమౌతుంది?" అంటూ దీర్ఘాలు తీసేది.

"చాల్లేవే, నేర్చుకొనిపోయావు. నీ కూతుర్ని చూడరాదూ! గడకర్రలా పెరిగింది కాని ఒక్క పని కూడా చేతకాదు. అటు పుల్ల తీసి ఇటు పెట్టను కూడా ముందుకు

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Todokarundina**

* * *